www.prajasakti.com
ప్రజాశక్తి
ఆదివారం 21 సెప్టెంబర్ 2025
5
తూర్పుగోదావరి



కరాటే జట్టుకు ఆదిత్య విద్యార్థిని ఎంపిక

ప్రజాశక్తి- నిడదవోలు

నిడదవోలు ఆదిత్య స్కూల్ 6వ తరగతి విద్యార్థిని షేక్ సన అఫ్రీన్ అండర్-14 విభాగంలో జిల్లా స్థాయి కరాటే జట్టుకు ఎంపికైనట్లు స్కూల్ ప్రిన్సిపల్ కరీమా తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ షేక్ సన అఫ్రీన్ విజయం తమ పాఠశాలకు గర్వకారణమన్నారు. తల్లిదండ్రుల ప్రోత్సాహం, గురువుల కృషి, విద్యార్థిని ప్రతిభ కలిసి ఇంతటి విజయాన్ని సాధించాయన్నారు. ఈ విజయం మిగతా విద్యార్థులకు ప్రేరణగా నిలుస్తుందన్నారు. చిన్న వయసులోనే క్రమశిక్షణ, పట్టుదల, కృషితో ఈ స్థాయికి చేరుకోవడం అఫ్రీన్ ప్రతిభను చాటిచెప్పిందన్నారు. ఆదిత్య స్కూల్ యాజమాన్యం అఫ్రీన్‌కు శుభాకాంక్షలు తెలిపి అభినందించారు.

పక్కా దారి.. నిధుల పక్కదారి..

- ఉపాధి నిధులతో ప్రయివేట్ పరిశ్రమకు రోడ్డు
- దేచర్లలో గ్లాస్ ఫ్యాక్టరీకి రోడ్డు నిర్మాణం
- రూ.1.10 కోట్ల ప్రజాధనం దుర్వినియోగం

ప్రజాశక్తి -కొవ్వూరు

కూలీల జీవనోపాధికి నిర్దేశించిన జాతీయ ఉపాధి హామీ పథకం కొవ్వూరులో పక్కదారి పడుతోంది. కూలీలకు ఉపాధి కల్పించాలన్న సంకల్పంతో రూపొందించిన ఎన్ఆర్ఇజిఎస్ పథకం నిధులు కొవ్వూరు నియోజకవర్గంలో ఒక పారిశ్రామిక సంస్థకు వెళ్లే రహదారి నిర్మాణానికి కేటాయించడం వివాదాస్పదమైంది. ఏకంగా రూ.కోటి వెచ్చించి ఈ రహదారి నిర్మాణం చేపట్టడం శోచనీయం. నియోజకవర్గంలో జాతీయ ఉపాధి హామీ పథకం కింద రూ.20 కోట్లు నిధులు మంజూరు అయ్యాయి. వీటిలో ఈ పంచాయతీకి రూ.1.25 కోట్లు నిధులు కేటాయించారు. వాస్తవంగా ఇదే పంచాయతీలో పరిధిలో అనేక రోడ్లు, పుంత రోడ్లు, అంతర్గత రోడ్లు గోతులతో అధ్వానంగా ఉన్నాయి. దేచర్ల, ఐపంగిడి గ్రామంలో కనీసం నడవడానికి వీల్లేని అనేక రోడ్లు ఉన్నాయి. కేంద్ర ప్రభుత్వం ఎంతో ఉన్నత లక్ష్యంతో విడుదల చేసిన ఈ నిధులను రాష్ట్ర ప్రభుత్వం సద్వినియోగ పర్చుకోలేకపోవడం విమర్శలకు తావిస్తోంది. కూటమి నేతలే ఈ



ఉపాధి నిధులు కేటాయించిన గ్లాస్ ఫ్యాక్టరీకి వెళ్లే రహదారి ఇదే

కేటాయింపులపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అయినప్పటికీ అధికారులు పట్టించుకోకపోవడం శోచనీయం. దేచర్ల రెవెన్యూ పరిధిలో ఉన్న గ్లాస్ ఫ్యాక్టరీకి జీవలకు మండల పరిషత్ నిధులతో రూ.10.10 లక్షలు వెచ్చించి ఈ రహదారి నిర్మించారు. అంతటితో ఆగక ప్రజా అవసరాలను పక్కనపెట్టి రూ.కోటి వ్యయంతో నాలుగు భాగాలుగా ఈ రోడ్డు నిర్మాణానికి ప్రతిపాదించారు. రెండు రోడ్లకు రూ.30 లక్షల చొప్పున, మరో రెండు భాగాలకు రూ.20 లక్షల చొప్పున విభజించి నిధులు కేటాయించారు.

నిబంధనలకు తూట్లు

జాతీయ ఉపాధి హామీ పథకం నిధులను 6 మీటర్లు వెడల్పుకు మించి రోడ్ల నిర్మాణం చేపట్టకూడదనే నిబంధన ఉంది. ఈ నిబంధనను తుంగలో తొక్కి ఒకే రోడ్డును నాలుగు భాగాలుగా ఈ రహదారిని విభజించి నిధులు కేటాయించారు. వాటర్ బాండ్ మెటల్ రోడ్డుగా దీన్ని నిర్మాణం చేస్తున్నారు. ఇప్పటికే రూ.10 లక్షలు వెచ్చించి మండల పరిషత్ నిధులతో నిర్మించిన రహదారి నామరూపం లేదు. మళ్లీ ఇదే రోడ్డుకు రూ.కోటి వెచ్చించడం ప్రజాధనం దుర్వినియోగమని నిపుణులు పేర్కొంటున్నారు. ఈ రోడ్డు మార్గంలో అనేక నల్ల రాతి క్వారీలు, క్రషర్లు ఉన్నాయి. క్వారీల నుంచి గ్లాస్ ఫ్యాక్టరీ నుంచి భారీ టన్నుల సామర్థ్యంతో వాహనాలు వెళుతుంటాయి. దీంతో రోడ్డు మూన్నాళ్ల ముచ్చట అవుతుందని నిపుణులు చెబుతున్నారు. కేవలం ఒక పరిశ్రమ అవసరాలను తీర్చడం కోసం రూ.1.10 కోట్ల ప్రజాధనాన్ని దుర్వినియోగం చేస్తున్నారని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. దీనిపై కూటమి నాయకులు సైతం ప్రభుత్వ తీరును తప్పుపడుతున్నారు.

నియోజక వర్గంలో 112 పనులకు రూ.20 కోట్ల వ్యయంతో ఎన్ఆర్ఇజిఎస్ పనులు చేపడుతున్నారు. కొవ్వూరు మండలంలో దొమ్మేరుకు అత్యధికంగా రూ.2.25 కోట్లు, ఐ.పంగిడికి రూ.కోటి 25 లక్షలు కేటాయించారు. ఐ.పంగిడి పంచాయతీలో కేటాయించిన రూ.కోటి నూతనంగా నిర్మించిన గ్లాస్ ఫ్యాక్టరీకి వెళ్లే అప్రోచ్ రోడ్‌కు కేటాయించడం శోచనీయం. గతంలో ఉపాధి పనుల పని దినాలను ఆధారంగా చేసుకుని నిధులు కేటాయింపు చేశారు. 40 శాతం లేబర్ పనిదినాలు, 60 శాతం మెటీరియల్ కాంపోనెంట్ కింద ఈ పనులు చేపట్టారు. ఐ.పంగిడి పంచాయతీ మినహా మిగిలిన అన్ని గ్రామాల్లోనూ బిటి రోడ్లు, సిమెంట్ రోడ్లు డ్రెన్లు వంటివి నిర్మిస్తున్నారు. ఫ్యాక్టరీ ద్వారా స్థానికులకు 70 శాతం ఉద్యోగాలు కల్పిస్తామని నిర్మాణ సమయంలో హామీ ఇచ్చారు. సిఎస్ఆర్ నిధులతో గ్రామంలో సామాజిక సేవా కార్యక్రమాలు, ప్రజా ఉపయోగ కార్యక్రమాలు నిర్వహించాల్సి ఉంది. ఇంతవరకు ఆ పనులు చేసిన దాఖలాలు లేవు. స్థానికులను కేవలం రోజువారీ కూలీ అవసరాలకు మాత్రమే ఇక్కడ వినియోగిస్తున్నారు. ఇతర రాష్ట్రాల నుంచి తీసుకువచ్చిన కూలీలతో ఇక్కడ పనులు చేయిస్తున్నారు. ప్రారంభ సమయంలో నైపుణ్యత లేని కార్మికులు ఉంటే వారికి శిక్షణ అందించి ఉపాధి కల్పిస్తామని యాజమాన్యం ఇక్కడి ప్రజలకు హామీ ఇచ్చింది. దీంతో పరిశ్రమ ఏర్పాటు సమయంలో ఎటువంటి అభ్యంతరాలు లేకుండా నిర్మాణం పూర్తి చేశారు.

ప్రజావసరాలు విస్మరించడం బాధాకరం



రూ.కోటి ఉపాధి నిధులను గ్లాస్ ఫ్యాక్టరీకి వెళ్లే రోడ్డుకే కేటాయించడం దుర్మార్గం. ఐ.పంగిడి, దేచర్ల గ్రామాల్లో అనేక రహదారులు, డ్రెన్లు అధ్వానంగా ఉన్నాయి. ఈ నిధులతో ప్రజలకు అవసరమైన పనులు చేస్తే బాగుంటుంది. ఇప్పటికే ఇదే రహదారికి మండల పరిషత్ నుంచి రూ.10 లక్షలు వెచ్చించి రోడ్డు నిర్మించారు. మళ్లీ అదే రహదారికి రూ.కోటి మంజూరు చేయడం ప్రజాధనం దుర్వినియోగం చేయడమే.

-పికె.రంగారావు, మాజీ ఎంపిపి,
జనసేన పార్టీ నేత, ఐ.పంగిడి.

25న విజయవాడలో కెవిపిఎస్ నిరసన

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం ప్రతినిధి



మాట్లాడుతున్న కెవిపిఎస్ నాయకుడు అండ్ర మాల్యాద్రి తదితరులు

ఎస్‌సి, ఎస్‌టి అత్యాచార నిరోధక చట్టం అమలులో పాలకుల వైఫల్యాలను ఎండగడుతూ ఈ నెల 25న విజయవాడ ధర్నా చౌక్‌లో రాష్ట్ర స్థాయి కార్యక్రమానికి దళిత గిరిజన సంఘాలు అందరూ తరలి రావాలని కెవిపిఎస్ రాష్ట్ర కార్యదర్శి అండ్ర మాల్యాద్రి పిలుపు ఇచ్చారు. శనివారం కెవిపిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి జువ్వల రాంబాబుతో కలిసి దాడులకు గురైన బాధితులను కలిసి వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఈ సందర్భంగా పేపర్ మిల్లు పందిరి మహదేవుడు కాలనీలో అంబేద్కర్ విగ్రహం వద్ద మాల్యాద్రి మీడియాతో మాట్లాడారు. అట్రాసిటీ నిరోధక చట్టాన్ని సక్రమంగా అమలు చేయాలని, కౌంటర్ కేసులు నమోదు చేయడాన్ని ఆపాలని, దళిత గిరిజనులపై దాడులు అరికట్టాలని డిమాండ్ చేశారు. దళితులపై దాడులు కేసుల్లో చట్ట ప్రకారం బెయిల్ ఇచ్చే అవకాశం లేదని గుర్తు చేశారు. అయినప్పటికీ స్టేషన్ బెయిల్ 41ఎ నోటీసులు ఇచ్చి నిందితులను వదిలేయటం దారుణమన్నారు. దళిత గిరిజన సమస్యలు పరిస్కారం కోసం జస్టిస్ పున్నయ్య కమిషన్ సిఫార్సులు అమలు చేయాలని డిమాండ్ చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 17 నెలల్లో ఒక్కసారి కూడా అత్యాచార నిరోధక చట్టం అమలు తీరుపై సమీక్ష నిర్వహించలేదన్నారు. గత వైసిపి ప్రభుత్వం ఐదేళ్లలో ఒక్కసారి కూడా ఈ చట్టం అమలు తీరుపై సమీక్ష చేపట్టలేదన్నారు. పాలకుల నిర్లక్ష్యం కారణంగా క్షేత్రస్థాయిలో నానాటికి దాడులు అధిక మవుతున్నాయని అన్నారు. సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి బి.పవన్, డివైఎఫ్ఐ నాయకులు వి.రాంబాబు, కెవిపిఎస్ నాయకులు దువ్వాడ రాజా తదితరులు పాల్గొన్నారు.

ప్రాధాన్యతా క్రమంలో అభివృద్ధి పనులు

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ కీర్తి చేకూరి

ప్రజల్లో సంతప్తి ఉండేలా.. ప్రాధాన్యత క్రమంలో నగరంలో అభివృద్ధి పనులను చేపట్టాలని అధికారులకు కలెక్టర్ కీర్తి చేకూరి సూచించారు. నగరపాలక సంస్థ కార్యాలయంలో టౌన్ ప్లానింగ్, ఇంజినీరింగ్ విభాగాధిపతులతో శనివారం సమీక్ష నిర్వహించారు. తొలుత నగరంలో రోడ్ల విస్తరణ పనులపై ఆరా తీశారు. మొదటి దశలో చేపట్టిన 15 రహదారుల విస్తరణ పనులను నెల రోజుల్లోగా పూర్తి చేయాలని ఆదేశించారు. అనంతరం పురోగతిలో ఉన్న అభివృద్ధి పనులపై డివిజన్ల వారీగా సమీక్షించారు. వర్షాల కారణంగా ముంపునకు గురవుతున్న ప్రాంతాల గురించి అడిగి తెలుసుకున్నారు. లోతట్టు వీధులలో నీరు నిలిచిపోకుండా సమగ్ర యాక్షన్ ప్లాన్ సిద్ధం చేయవలసిందిగా ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. తాగునీటి సరఫరాలో ఎక్కడా ఫిర్యాదులు రాకూడదని, నీటిని ప్రతీరోజూ పరీక్షించాలన్నారు. మురుగు కాలువల్లో ఎక్కడైనా తాగునీటి పైపులైన్లు ఉంటే తక్షణమే మార్చాలన్నారు. ఈ సమావేశంలో అడిషనల్ కమిషనర్ పివి.రామలింగేశ్వర్, డిప్యూటీ కమిషనర్ ఎస్.వెంకటరమణ, సెక్రటరీ జి.శైలజవల్లి, సిటీ ప్లానర్ జి.కోటయ్య, ఎస్ఇ రీటా, ఎంహెచ్ఒ వినూత్న, రెవెన్యూ అధికారులు సిహెచ్.శ్రీనివాసరావు, రవికుమార్, మేనేజర్ ఎండి అబ్దుల్ మాలిక్, ఇఇలు మాధవి, మదర్సా అలీ, అకౌంటెంట్ నాగమణి, సిఎంఎం రామలక్ష్మి పాల్గొన్నారు.

జిఎస్‌టి రేట్ల తగ్గింపు నిర్ధిష్టంగా ప్రకటించాలి

ప్రజాశక్తి- రాజమహేంద్రవరం ప్రతినిధి

ఈ నెల 22 నుంచి అమల్లోకి రానున్న జిఎస్‌టి పన్ను తగ్గింపు ప్రతిదానిపై ఎంత అన్నది నిర్ధిష్టంగా ప్రకటించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి టి.అరుణ్ శనివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. అన్ని నిత్యావసర సరుకులు ధరలు, మందుల ధరలు, విద్యా సంబంధమైన వస్తువుల ధరలు ప్రస్తుతం మార్కెట్‌లో ఎంత రేటు ఉన్నదీ, జిఎస్‌టి తగ్గింపు తర్వాత ఎంత ఉన్నదీ ప్రకటించాలన్నారు. విజయ, సంగం సహకార డైరీలు తమ పాల ఉత్పత్తులపై ధరలు తగ్గించడాన్ని ఆయన స్వాగతించారు. ఇదే రకంగా అన్ని సరుకుల ధరలు తగ్గింపు రేట్లు ప్రకటించాలని డిమాండ్ చేశారు. సంగం, విజయ డైరీ టెట్రా ప్యాక్ పాలు లీటరుకు రూ.ఐదు తగ్గించగా, హెరిటేజ్ పాలు రూ.మూడు మాత్రమే తగ్గించడం హేతుబద్ధంగా లేదన్నారు. రిలయన్స్ సహా కొన్ని కంపెనీలు ధరలు తగ్గింపును ప్రకటించాయి కానీ తగ్గింపును ఎంఆర్‌పిపై చూపించాయన్నారు. ఈ మోసాన్ని అరికట్టాలని, తగ్గిన జిఎస్‌టిని పూర్తిగా ప్రజలకు చేరవేయాలని, రేట్లు తగ్గించని వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

సెలవుల్లో తరగతులు నిర్వహిస్తే కఠిన చర్యలు

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

జిల్లాలోని అన్ని యాజమాన్యాల ప్రభుత్వ ప్రైవేటు పాఠశాలలన్నింటికీ ఈ నెల 22వ తేదీ నుంచి అక్టోబర్ 2వ తేదీ వరకూ దసరా సెలవులను ప్రకటించినట్టు జిల్లా విద్యాశాఖాధికారి కె.వాసుదేవరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నిబంధనలను అన్ని యాజమాన్యాల పాఠశాలలు ఖచ్చితంగా పాటించాలని, ఎట్టి పరిస్థితుల్లోనూ దసరా సెలవుల్లో తరగతులు నిర్వహించరాదని, ఈ నిబంధన అతిక్రమించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎట్టి పరిస్థితుల్లోనూ సెలవుల్లో విద్యార్థులను పాఠశాలలకు పంపించవద్దని తెలిపారు. దసరా సెలవుల్లో బయటకు తెలియకుండా ఎవరైనా పాఠశాల నిర్వహించినా, ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరిగినా ఆ పాఠశాల వారే బాధ్యులవుతారన్నారు.

సమస్యల పరిష్కారం కోసం గ్రీవెన్స్

ప్రజాశక్తి -కొవ్వూరు

నియోజకవర్గంలో ప్రజా సమస్యలను ఎప్పటికప్పుడు తెలుసుకుని వాటిని పరిష్కరించాలని ఉద్దేశంతోనే గ్రీవెన్స్ డే నిర్వహిస్తున్నామని ఎంఎల్‌ఎ ముప్పిడి వెంకటేశ్వరరావు పేర్కొన్నారు. కొవ్వూరు టిడిపి కార్యాలయంలో ఆయన శనివారం ప్రజల నుంచి వినతిపత్రాలు స్వీకరించారు. హెల్త్ పింఛను, సాధారణ పింఛన్లు, రెవెన్యూ పరమైన సమస్యలకు సంబంధించి పది వినతిపత్రాలు అందినట్టు ఆయన తెలిపారు. వీటి పరిష్కారం కోసం సంబంధిత అధికారులకు సిఫార్సు చేసినట్టు తెలిపారు.

ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి-కడియం

ప్రభుత్వ ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోరుతూ ఎపి పభుత్వ ఉద్యోగుల సంఘం నిర్వహిస్తున్న 'రండి టీ త్రాగుతూ మాట్లాడుకుందాం' కార్యక్రమం శనివారం కొంతమూరు సచివాలయంలో నిర్వహించారు. ఈ కార్యక్రమం రాజమహేంద్రవరం రూరల్ అధ్యక్షుడు ఎన్‌విఎస్.రాజు అధ్యక్షతన నిర్వహించగా జిల్లా కార్యదర్శి సిహెచ్ఎస్.విల్సన్‌పాల్ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వ ఉద్యోగులకు రావాల్సిన రూ.30 వేల కోట్ల బకాయిలను ప్రతి ఉద్యోగికీ ఎంత బకాయి ఉందో సంబంధిత డ్రాయింగ్ అధికారుల ద్వారా సర్వీస్ రిజిస్టర్‌లో నమోదు చేయాలన్నారు. బకాయిలకు తగినట్టు రాష్ట్ర ప్రభుత్వం ఇళ్ల స్థలాలు కేటాయించాలని డిమాండ్ చేశారు. ఉద్యోగులకు వెంటనే మధ్యంతర భృతి చెల్లించాలని, రిటైర్డ్ న్యాయమూర్తి లేదా సిట్టింగ్ న్యాయమూర్తి ఆధ్వర్యంలో త్రిసభ్య పిఆర్‌సి కమిటీ ఏర్పాటు చేసి అమలు చేయాలని డిమాండ్ చేసారు. సచివాలయ ఉద్యోగులకు సంబంధించి అనేక సమస్యలు ఉన్నాయని, వారిని మాతృశాఖలోనికి తీసుకొని ఒకే అధికారి నియంత్రణలో పనిచేసే విధంగా రూపకల్పన చేయాలని డిమాండ్ చేశారు. సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కెఆర్.సూర్యనారాయణ మాట్లాడిన వీడియోలను ప్రదర్శించి ఉద్యోగులతో చర్చించారు. తాలూకా కార్యదర్శి పి.మురళీకృష్ణ, ట్రెజరర్ వై.శాంతిరాజు, సంయుక్త కార్యదర్శి శంకరరావు, పంచాయతీ కార్యదర్శి డి.శ్రీనివాసరావు పాల్గొన్నారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న విల్సన్‌పాల్

ఆర్‌ఒడిఒ కార్యాలయం వద్ద విఆర్‌ఎల ధర్నా

ప్రజాశక్తి- కొవ్వూరు

తమ న్యాయపరమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ శనివారం డివిజన్ పరిధిలోని విఆర్‌ఎలు శనివారం ఆర్‌డిఒ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. విఆర్‌ఎల జిల్లా అధ్యక్షుడు మల్లిమొగ్గ వెంకటరమణ మాట్లాడుతూ విఆర్‌ఎలు చాలీచాలని జీతాలతో కుటుంబ పోషణ భారమై ఇబ్బంది పడుతున్నారన్నారు. కనీస వేతనాలు రూ.26000 చెల్లించాలని డిమాండ్ చేశారు. తమను నాలుగో తరగతి ఉద్యోగులుగా గుర్తించాలని, తహశీల్దార్, ఆర్‌డిఒ కార్యాలయాల్లో ఖాళీగా ఉన్న వాచ్‌మెన్, అటెండర్ పోస్టులను అర్హులైన విఆర్‌ఎల చేత భర్తీ చేయాలని కోరారు. కూటమి ప్రభుత్వం ఈ అసెంబ్లీ సమావేశాల్లోనే తమ జీతాల పెంపు నిర్ణయాన్ని వెల్లడించాలన్నారు. గతంలోనే తమ సమస్యలు పరిష్కరించాలని ఎంఎల్‌ఎలు, ఎంపీలు, మంత్రులను కలిసి విన్నవించుకున్నామన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాదిన్నర కావస్తున్న ఇంతవరకు తమ సమస్యలను పట్టించుకోలేదన్నారు. నామినీలకు విఆర్‌ఎగా అవకాశం కల్పించాలని కోరారు. విఆర్‌ఎల సంఘం అధ్యక్షుడు కె.రాజేంద్ర ప్రసాద్, విఆర్‌ఎలు పాల్గొన్నారు. అనంతరం ఆర్‌డిఒ రాణి సుస్మితకు తమ డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని అందజేశారు.



ఆర్‌డిఒ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న విఆర్‌ఎలు

గేదెలు మృతి చెందిన రైతులకు పరిహారం

ప్రజాశక్తి -కొవ్వూరు

పెద్దేవం, ఐ.పంగిడిలో పాడి గేదెలు మృతి చెందిన రైతులకు ప్రభుత్వం ద్వారా నష్టపరిహారం అందించే విధంగా చర్యలు తీసుకుంటానని ఎంఎల్‌ఎ ముప్పిడి వెంకటేశ్వరరావు ప్రకటించారు. పట్టణంలో టిడిపి కార్యాలయంలో శనివారం ఆయన పశుసంవర్ధక శాఖ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. పాడిగేతులు మృతి చెందుతున్న సంఘటనపై శుక్రవారం అసెంబ్లీలో చర్చించినట్లు తెలిపారు. వ్యాధి నిర్ధారణకు అవసరమైన చర్యలు తీసుకుంటామని, పాడి గేదెలకు అవసరమైన మెరుగైన చికిత్స అందించే విధంగా చూస్తామని మంత్రి హామీ ఇచ్చినట్లు ఆయన తెలిపారు. ఇప్పటికే వ్యాధి బారిన పడిన పశువులకు మెరుగైన చికిత్స అందించే విధంగా అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. కంఠమని రామకృష్ణ, జొన్నలగడ్డ సుబ్బరాయ చౌదరి, మాజీ మున్సిపల్ చైర్మన్ సూరపనేని చిన్ని, ఆరికరేవుల సొసైటీ అధ్యక్షుడు చావా శ్రీనివాస్, దాయన రామకృష్ణ, పశుసంవర్ధక శాఖ ఎడి వెంకట్ రెడ్డి పాల్గొన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయులకు సత్కారం

ప్రజాశక్తి-తాళ్లపూడి

ప్రతి ఉపాధ్యాయుడు విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తయారు చేస్తూ మరిన్ని అవార్డులు అందుకోవాలని ఎంఇఒ-2 నెహ్రూజీ అన్నారు. మండలం నుంచి ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన పలువురు ఉపాధ్యాయులను శనివారం ఘనంగా సన్మానించారు. బి.శంకర్రావు, డి.రాము, పి.రామలక్ష్మి, పి.కనకదుర్గ, బి.బుచ్చిబాబు, వి.నాగజ్యోతి, ఎం.జయబాబు, కె.రాజ్యలక్ష్మితోపాటు జిల్లా ఉత్తమ ఉపాధ్యాయులుగా అవార్డులు అందుకున్న ఎం.రాజకుమారి, వై.శంకరం, ఎఎన్‌వి.రామ్మోహన్‌రావును ఘనంగా సత్కరించారు.

గుడ్ టచ్ బాడ్ టచ్‌పై అవగాహన

ప్రజాశక్తి-నల్లజర్ల

నల్లజర్లలోని స్థానిక ఎస్ఆర్‌కె కాలేజీలో నల్లజర్ల పోలీసులు, శక్తి టీమ్ గుడ్ టచ్ బ్యాడ్ టచ్‌పై విద్యార్థినిలకు శనివారం అవగాహనా సదస్సు నిర్వహించారు. కొవ్వూరు డిఎస్‌పి దేవకుమార్ ఆదేశాల ప్రకారం ఈ కార్యక్రమం నిర్వహించినట్టు సిఐ బాల సౌరి తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల చైర్మన్ కంఠమని వసుందరా దేవి పాల్గొన్నారు.

పౌష్టికాహారంపై అవగాహన

ప్రజాశక్తి-చాగల్లు

మండలంలోని మార్కొండపాడు సెక్టార్‌లో 8వ రాష్ట్రీయ పోషణ మాసం 2025 సుపోషిత భారత్ సత్సంగ్‌లో భాగంగా శనివారం బ్రాహ్మణగూడెం హైస్కూల్లో కిషోర్ బాలికలకు పౌష్టికాఆహారం గురించి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం విజయకుమార్ ఐసిడిఎస్ సూపర్‌వైజర్ జి.శిరీష, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

యుటిఎఫ్ రణభేరి జాతా పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి- రాజానగరం

ప్రభుత్వ విద్యారంగ సమస్యలు, ఉద్యోగ, ఉపాధ్యాయ ఆర్థిక సమస్యల పరిష్కారం కోరుతూ 15వ తేదీ నుంచి 19 వరకూ యుటిఎఫ్ చేపట్టిన రణభేరి జాతా పోస్టర్‌ను శనివారం ఆవిష్కరించారు. యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి ఎ.షరీఫ్ మాట్లాడుతూ రాష్ట్రంలో 5 ప్రాంతాల నుంచి రణభేరిజాతా మొదలవుతుని, ఐదు రోజుల పాటు రాష్ట్రంలో అన్ని ప్రాంతాల్లో పర్యటిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో శ్రీనుబాబు, జిల్లా కార్యదర్శి దయానిధి, మండల అధ్యక్షుడు ఐ.రాజేశ్వరి, ఐ.విజయబాబు, ఎస్.అనిల్‌కుమార్, ఇస్మాయిల్, వి.విజయబాబు, కె.ఉషశ్రీ పి.నాగేశ్వరరావు, దుర్గరాజు, జ్యోతి పాల్గొన్నారు.

నల్లజర్ల యుటిఎఫ్ చేపట్టిన రణభేరి జాతా మహాసభను విజయవంతం చేయాలని పలువురు కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి సిహెచ్ఎస్ఎస్.మనోహర్ కుమార్, బండి కిషోర్, పల్లి వెంకట అప్పారావు, కె.కృష్ణవేణి, ఎన్.ఉమామహేశ్వరరావు, ఆర్.నిర్మల పాల్గొన్నారు.

సమస్యలపై విద్యుత్ సిబ్బంది రిలే దీక్ష

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

ఎపి పవర్ ఎంప్లాయిస్ జెఎసి ఆధ్వర్యాన శనివారం ఇపిడిసిఎల్ సర్కిల్ ఆఫీస్ దగ్గరలో పూలే గారి విగ్రహం వద్ద రిలే నిరాహారదీక్ష చేపట్టారు. ఈ కార్యక్రమంలో రాజమహేంద్రవరం సర్కిల్‌లోని అన్ని డివిజన్ల యూనియన్లు, అసోసియేషన్ల నుంచి సభ్యులు రిలే నిరాహారదీక్షలో పాల్గొన్నారు. ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లను యాజమాన్యం పరిష్కరించాలని డిమాండ్ చేశారు. డిమాండ్లను పరిష్కరించేవరకు ఆందోళన విరమించేదిలేదని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమానికి జెఎసి జిల్లా చైర్మన్ వివిఎస్.నాగేశ్వరరావు, డివిజన్ చైర్మన్ ఎం.శ్రీనివాస్, డివిజన్ కన్వీనర్ కె.శ్రీనివాస్ హాజరయ్యారు.

కొవ్వూరులో కూలిన భారీ వక్షం

ప్రజాశక్తి -కొవ్వూరు

పట్టణంలో బాపూజీ నగర్‌లోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల సమీపంలో ఒక భారీ వృక్షం శనివారం కూలిపోయింది. ఆ సమయంలో ఆ మార్గంలో ఎవరూ లేకపోవడంతో ఏ విధమైన ప్రమాదం సంభవించలేదు. వృక్షం రోడ్డుకు అడ్డంగా పడిపోవడంతో ఆ మార్గంలో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. అధికారులు స్పందించి కూలిన వక్షాన్ని తొలగించాలని స్థానికులు కోరుతున్నారు.

నియామక పత్రాల అందజేత

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం రూరల్

వివిధ కంపెనీల్లో ఉద్యోగావకాశాలు పొందిన అభ్యర్థులకు శనివారం కలెక్టర్ కీర్తి చేకూరి ధ్రువపత్రాలు అందజేసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లా ఉపాధికల్పన, వికాస ద్వారా నేరుగా జాబ్ మేళాలు, నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలు, నాక్ ద్వారా శిక్షణా తరగతులు నిర్వహించి ఉద్యోగావకాశాలు కల్పిస్తున్నట్టు తెలిపారు. యువత అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. శనివారం వికాస ఆధ్వర్యంలో కలెక్టరేట్‌లో నిర్వహించిన జాబ్ మేళాలో 14 మంది ఎంపికైనట్టు వికాస పీడీ కె.లచ్చారావు తెలిపారు.

లాకుల ఆధునికీకరణకు కృషి

ప్రజాశక్తి-కడియం

గత కొన్నేళ్లుగా రాష్ట్రవ్యాప్తంగా నిర్వహణ లోపం వల్ల అనేక లాకులు శిథిలావస్థకు చేరుకున్నాయని, గోదావరి తూర్పు డెల్టా ప్రాజెక్ట్ కమిటీ చైర్మన్ మురాలశెట్టి సునీల్ కుమార్ పేర్కొన్నారు. శనివారం కడియం లాకులను స్థానిక నీటి సంఘం అధ్యక్షుడు చిక్కాల ఈశ్వరరావుతో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా కొన్నిచోట్ల లాకులు, కాలువలను ఇటీవల ఆధునీకరించినట్టు తెలిపారు. మరికొన్ని చోట్ల చేయాల్సి ఉందని, అందులో కడియం లాకులు కూడా ఉన్నాయన్నారు. కడియం నీటి సంఘం అధ్యక్షులు చిక్కాల ఈశ్వరరావు, తమలంపూడి సుధాకర్ రెడ్డి పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనం పరిశీలన

ప్రజాశక్తి - ఉండ్రాజవరం

విద్యార్థులకు అందజేసే మధ్యాహ్న భోజనం విషయంలో నాణ్యతలో రాజీ పడకుండా పంపిణీ చేయాలని తహశీల్దారు పిఎన్‌డి.ప్రసాద్ సూచించారు. శనివారం వెలగదుర్రు పాఠశాలలో ఆయన మధ్యాహ్న భోజన పంపిణీని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ సాగి రామకృష్ణంరాజు, ఎంపిడిఒ వివివిఎస్.రామారావు, మండల శానిటరీ కో ఆర్డినేటర్ కత్తుల ప్రకాష్, పంచాయతీ కార్యదర్శి త్రివేణి, ఉపాధ్యాయులు అహల్య లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

కార్టూ'నిజం'



కంపుగొడుతున్న కడియపులంక
అటకెక్కిన పారిశుధ్యం
నేటికీ బహిరంగ మలవిసర్జన

పర్యావరణ హితమే స్వచ్ఛ ఆంధ్ర లక్ష్యం

పలుచోట్ల శనివారం స్వచ్ఛ ఆంధ్ర, స్వర్ణ ఆంధ్ర కార్యక్రమాలు నిర్వహించారు.

ప్రజాశక్తి -యంత్రాంగం

కొవ్వూరు శుభ్రత, పారిశుధ్యం, పర్యావరణ స్థిరత్వమే లక్ష్యంగా స్వచ్ఛ ఆంధ్ర - స్వర్ణాంధ్ర కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని ఎంఎల్‌ఎ ముప్పిడి వెంకటేశ్వరరావు పేర్కొన్నారు. పట్టణంలో మున్సిపల్ హైస్కూల్లో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. అధికారులు ప్రజాప్రతినిధులతో కలిసి ప్రాంగణంలో మొక్కలు నాటారు. జొన్నలగడ్డ సుబ్బరాయ చౌదరి, కంఠమని రామకృష్ణ, మున్సిపల్ చైర్‌పర్సన్ భావన రత్నకుమారి, మాజీ చైర్మన్ సూరపనేని చిన్ని, టౌన్ టిడిపి అధ్యక్షుడు దాయన రామకృష్ణ, నాయకులు సూర్యదేవర రంజిత్, బర్ల శ్రీనివాస్ పాల్గొన్నారు.

బిక్కవోలు మండల కార్యాలయ ఆవరణలో ఎంపిడిఒ వి.శ్రీనివాస్ తమ సిబ్బందితో కలిసి మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో పరిపాలనాధికారి విఎన్.ప్రసాద్ పాల్గొన్నారు.

పెరవలి మండల ప్రత్యేకాధికారి ఎం.సునీల్ వినయ్, ఎంపిడిఒ కెయుఆర్ఎల్.పద్మజ మొక్కల నాటి ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎంపిడిఒ సిహెచ్.వెంకటరమణ ఎంఇఒ స్వరూప్ పాల్గొన్నారు.



పెరవలిలో మొక్కలు నాటుతున్న అధికారులు

దేవరపల్లి స్వచ్ఛాంధ్ర-స్వచ్ఛ భారత్ కార్యక్రమంలో భాగంగా శనివారం దేవరపల్లి మండల పరిషత్ కార్యాలయ ప్రాంగణంలో మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. 'పచ్చని చెట్లు-ప్రగతికి మెట్లు' అనే నినాదంతో చేపట్టిన ఈ కార్యక్రమంలో మండల పరిషత్ అధ్యక్షుడు కెవికె.దుర్గారావు, ఎంపిఒడిఒ వై.రాజారావు, కార్యాలయ సిబ్బంది, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

చోరీ కేసుల్లో నలుగురు అరెస్టు

ప్రజాశక్తి - శంఖవరం

పలు ప్రాంతాల్లో ఇళ్లల్లో చోరీలు చేస్తున్న నలుగురు దొంగలను అరెస్ట్ చేసినట్లు అన్నవరం పోలీసులు తెలిపారు. వివరాల్లోకి వెళితే...వేరువేరు ప్రాంతానికి చెందిన పాలెపు సతీష్, బలసాడి ధనుష్, బన్నికల లక్ష్మణరావు, పంతాడి సత్యసాయి ఒక ముఠాగా ఏర్పడి పలు ఇళ్లల్లో దొంగతనాలు చేస్తున్నారు. ఇంట్లో ఉన్న బంగారు ఆభరణాలు, నగదును చోరీ చేసిన సంఘటనలపై బాధితులు ఇచ్చిన ఫిర్యాదుతో సంబంధిత దొంగలపై నిఘా పెట్టారు. శనివారం మండలంలోని కత్తిపూడి శివారున కాకినాడ వెళ్ళే వై జంక్షన్ వద్ద నలుగురు దొంగలను తమ సిబ్బంది అదుపులోకి తీసుకుని అరెస్ట్ చేసి, వారి నుంచి చోరీ సొత్తును స్వాధీనం చేసుకుని, ప్రత్తిపాడు కోర్టులో హాజరు పరుస్తున్నట్లు ఎస్ఐ హరిబాబు తెలిపారు.



మత్స్యకారుల మధ్య వాగ్వాదం

సభకు పెద్దింశెట్టి పిలుపు
దూసుకొచ్చిన ఎంపీ అనుచరుడు

ప్రజాశక్తి - యు.కొత్తపల్లి

మండలంలోని ఉప్పాడ గ్రామంలో ఆదివారం జరిగే మత్స్యకారుల పోరాట సభకు తెలుగు జనతా పార్టీ జాతీయ అధ్యక్షులు పెద్దింశెట్టి వెంకటేశ్వరరావు శనివారం జరిగిన సమావేశంలో పిలుపునిచ్చారు. దీంతో అమీనాబాద్‌కు చెందిన ఎంపి అనుచరుడు పెద్దింశెట్టితో ఘర్షణకు దిగాడు. దీంతో అతనిపై మత్స్యకారులు ఎదురు ప్రశ్నించారు. దీంతో పోలీసులు జోక్యంతో ఘర్షణ సద్దుమనిగింది.

వెనుకబడిన విద్యార్థులపై శ్రద్ధ

ప్రజాశక్తి - సామర్లకోట

విద్యలో వెనుకబడిన విద్యార్థుల పట్ల తగిన శ్రద్ధ పెట్టాలని ఎంఇఓ వై.శివరామకృష్ణయ్య సూచించారు. శనివారం మండలంలోని వేట్లపాలెం స్కూల్ కాంప్లెక్స్ సమావేశానికి కాంప్లెక్స్ హెచ్ఎం పి.అనురాధ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు రెమిడీఎల్ క్లాసులు నిర్వహించి వెనుక బడిన విద్యార్థులు లేకుండా చూడాలన్నారు. ప్రతి విద్యార్థి తెలుగు, ఇంగ్లీషు చదవడం రాయడం, గణితంలో చతుర్విధ ప్రక్రియలు చేయడం వంటి అంశాలకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. 2 నుంచి ఐదో తరగతి వరకు ప్రతి విద్యార్థి చదివించాల్సిన బాధ్యత పాఠశాల హెచ్ఎంపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో కాంప్లెక్స్ సెక్రటరీ ఎన్.నాగరాజు, నాయకులు ఆడారి చిట్టిబాబు, కాంప్లెక్స్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పోషణపై అవగాహనా ప్రదర్శన

ప్రజాశక్తి - పెద్దాపురం

ఐసిడిఎస్ ఆధ్వర్యంలో మండలంలోని రాయభూపాలపట్నంలో శనివారం పోషణ మహోత్సవాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి పెంకే సత్యవతి, సర్పంచ్ చీకట్ల లక్ష్మి పాల్గొన్నారు. కాండ్రకోట పిహెచ్‌సి వైద్యాధికారులు డాక్టర్ ఉషా, డాక్టర్ చంద్రకిరణ్ మహిళలకు, గర్భిణులకు ఆరోగ్య పరిరక్షణపై, పౌష్టికాహారంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా పౌష్టికాహార ఎగ్జిబిషన్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు ఎస్.సురేష్, మన్యం ప్రసన్నకుమార్, కె.శ్రీనివాస్, నల్లల శ్రీను, పెనుమర్తి దొరబాబు, పంచాయతీ కార్యదర్శి ఫణికుమార్ పాల్గొన్నారు.

అంబేద్కర్ విగ్రహావిష్కరణ

ప్రజాశక్తి - కరప

వేళంగి జడ్‌పి హైస్కూల్‌లో గ్రామ సర్పంచ్ సవిలే నీలిమ, రాజేష్ దంపతులు ఏర్పాటు చేసిన డాక్టర్ బిఆర్.అంబేద్కర్ విగ్రహాన్ని డాక్టర్ కాకర రామ్‌స్వరూప్ జవహర్ దంపతులు ఆవిష్కరించారు. ఉపాసక గిడ్ల వీరప్రసాద్ బౌద్ధ వందనంతో ప్రారంభమైన ఈ కార్యక్రమంలో మెర్ల వీరయ్య చౌదరి, బొండా వెంకన్నారావు, పాకా చంద్రరావు, ఎంఇఓ బులి కృష్ణవేణి, బౌద్ధ ఉపాసకుడు పొలుగుమాటి నరసింహమూర్తి, సేల్స్ టాక్స్ అధికారి స్రాంబత్తుల వెంకట్రావు, రిటైర్డ్ ఎమ్‌పిడిఓ రాఘవులు, హెచ్ఎం రాపర్తి త్రిమూర్తులు, ఉపాధ్యాయులు, పంచాయతీ కార్యదర్శి వీరభద్రరావు, అంబేద్కర్ యువజన సేవా సంఘం సభ్యులు, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ప్రజాశక్తి - తాళ్లరేవు

తాళ్లరేవు సెక్షన్ పరిధిలోని పలు గ్రామాల్లో ఆదివారం ఉదయం 9 గంటల నుంచి 11 గంటల వరకూ విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని ఎపిఇపిడిసిఎల్ ఇఇ ఎన్.ఉదయభాస్కర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. తాళ్లరేవు విద్యుత్ సబ్-స్టేషన్ పరిధిలోని 11 కెవి . కోస్టల్ ఆక్వా, ఇండిస్ట్రియల్ ఫీడర్, 11 కెవి గాడిమొగ ఫీడర్, 11కెవి జివిస్‌పిసి, కోరంగి, పల్లెపాలెం ఫీడర్ పరిధిలోని ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయము కలుగుతుందన్నారు.

అభివృద్ధి చేసుకుంటూ పోతాం

ప్రజాశక్తి - జగ్గంపేట

మీరు ఎన్ని ధర్నాలు చేసిన మేము అభివృద్ధిని చేసుకుంటూ పోతామని ఎంఎల్ఎ జ్యోతుల నెహ్రూ అన్నారు. శనివారం స్థానిక టిడిపి కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. ప్రభుత్వ మెడికల్ కాలేజీలు వల్ల సామాన్యులు చదువుకోలేని స్థితి ఏర్పడుతుందని వైసిపి నాయకులు ఆరోపణల్లో వాస్తవం లేదన్నారు. వైసిపి ప్రభుత్వంలో జగన్ 17 కాలేజీలకు మంజూరు ఇచ్చినా నిధులు ఇవ్వలేదన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చాక ఆ 17 కాలేజీలను పిపిపి విధానంలో 25 ఏళ్లకాలం నిబంధనతో ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. దీనివల్ల ప్రభుత్వానికి ఆర్థికంగా వెలుసుబాటు కలుగుతుందని, 25 సంవత్సరాల తర్వాత ఆ కాలేజీలు ప్రభుత్వపరం అవుతాయన్నారు. జగన్ ఏది మాట్లాడితే అది మాట్లాడటం తోట నరసింహంకు తగదన్నారు. అవగాహన చేసుకుని మాట్లాడితే మంచి దని హితవు పలికారు. ఈ సమావేశంలో టిడిపి నాయ కులు ఎస్‌విఎస్.అప్పలరాజు, కొత్త కొండబాబు, బుర్రి సత్తిబాబు, గెద్దాడ సత్యవేణి, కమ్మిల వెంకటేశ్వరరావు, పీలా మహేష్, తుమ్మల కిషోర్ పాల్గొన్నారు.

కూటమిపై పోరుబాట

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం ప్రతినిధి

కూటమిపై పాలనా వైఫల్యాలపై మొదలైన పోరుబాట పతాక స్థాయికి చేరింది. అధికారంలోకి వచ్చి 17 నెలలు గడిచినప్పటికీ సూపర్ సిక్స్ అమలుకే ప్రభుత్వం ఆప సోపాలు తప్పటం లేదు. మరోవైపు నియోజక వర్గాల వారీగా ఇచ్చిన హామీలు అమలు ఊసేలేదు. ఇంకోవైపు ఉద్యోగులు, విద్యార్థుల సమస్యలను పూర్తిగా విస్మరించటంతో ఆయా వర్గాలన్నీ పోరుబాటకు సిద్ధం అయ్యాయి. ఉపాధ్యాయ, ఉద్యో గ సమస్యలను పరిష్కరించాలంటూ చేపట్టిన రణభేరికి ఉపాధ్యాయులు బ్రహ్మరథం పట్టారు. ఈ పర్యటనలో పాల్గొన్న శాసన మండలి సభ్యులకు తమ వినతిపత్రాలను అందజేశారు. విజయవాడలో జరగబోయే ఆందోళనలకు తరలివెళ్తున్నారు. విద్యుత్ ఉద్యోగులు ఇప్పటికే భోజన విరామంలో నల్ల బ్యాడ్జీలతో నిరసన వ్యక్తం చేశారు. 20వ తేదీన నిరాహార దీక్షల తో పాటు 22న కలెక్టర్ కార్యాలయాలు ఎదుట ఆందోళనలకు సిద్ధమవుతున్నారు. సచివాలయ ఉద్యోగులు తమపై పని భారం తగ్గించాలని కోరుతూ ఉన్నతాధికారులకు తమ ఉద్యమ కార్యచరణను ప్రకటించడంతో పాలక ప్రభుత్వం బుజ్జ గింపులకు తెరలేపింది. విద్యారంగంలో సమస్యలు పరిష్క రించాలని కోరుతూ విద్యార్థుల పక్షాల ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో చేపట్టిన ఆందోళనపై పోలీసులు వ్యవరించిన తీరు సర్వత్రా విమర్శలకు దారి తీసింది. అధికారం చేపట్టి కనీసం 2 సంవత్సరాలు కూడా గడవకముందే కూటమి ప్రభుత్వం అన్ని వర్గాల నుంచి విమర్శలకు గురికావటం విశేషం.

మెడికల్ కాలేజీల ప్రయివేటీకరణపై భగ్గు

మెడికల్ కాలేజీల నిర్వహణా బాధ్యతలను పిపిపి విధానంలో అప్పజెబుతామంటూ రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న విధానపరమైన నిర్ణయంపై విద్యార్థులు భగ్గుమన్నారు. మరోవైపు ప్రతిపక్ష వైసిపి నేతలు చేపట్టిన ఆందోళనలను పోలీసులు అడ్డుకోవటం విమర్శలకు దారి తీసింది. వైసిపి పాలనలో మెడికల్ కాలేజీకి కేటాయించిన స్థలంలో పార్టీ కార్యాలయం నిర్మించేందుకు ప్రయత్నం చేయటంపై అప్పటి ప్రతిపక్ష టిడిపి భగ్గుమన్న విషయం విధితమే. అదేవిధంగా సెల్ఫ్ ఫైనాన్స్ విధానం అమల్లోకి తీసుకురావటంతో 43 శాతం సీట్లకు రూ.12 లక్షలు, రూ.20 లక్షలు చొప్పున విద్యార్థులు ఫీజులు చెల్లించక తప్పటం లేదు. తాజాగా కూటమి ప్రభుత్వం కారు చౌకగా ప్రయివేటు వ్యక్తులకు అప్పజెప్పటం వంటి విధానాలు రెండు పార్టీల వైఫల్యాలను దర్పణం పడుతున్నాయి. తాజాగా ఒకరిపై, మరొకరు విమర్శలు, ప్రతి విమర్శలు చేసుకుని రాజకీయ లబ్ధికోసం ప్రాకులాడుతున్నారనే అభిప్రాయం ప్రజల్లో వ్యక్తమవుతోంది. ఇప్పటికైనా ప్రజా ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని విద్యా, వైద్యం వంటి కీలక రంగాలను ప్రైయివేటుపరం కాకుండా చర్యలు తీసుకోవాలని, ఆదిశగా పాలకులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని ప్రజలు కోరుతున్నారు.

పాఢి రైతుల కంట చెమ్మ

తాళ్లపూడి, పంగిడి, గోపాలపురం తదితర మండలాల్లో అనారోగ్యంతో పశువుల మృత్యువాత పడటంతో పాడి రైతులకు కంటి మీద కునుకు లేకుండా చేస్తోంది. తూర్పుగోదావరి జిల్లాలో గత కొన్ని నెలలుగా గేదెల దొంగలు పెచ్చరిల్లుతున్నారు. దొంగల భారి నుంచి తమ పశు సంపదను రక్షించుకునేందుకు అష్టకష్టాలు పడుతున్న పాడి రైతులకు తాజా ఘటన గోరుచుట్టుపై రోకలిపోటులా మారింది. అధికార యంత్రాంగం ఇప్పటికే క్షేత్రస్థాయి పర్యటించి వివిధ రకాల పరీక్షలను నిర్వహించింది. అయితే థైలీరియాసిస్, ఆంపిస్టోమియాసిస్ లక్షణాలు



కొన్ని పశువులలో కన్పించడంతో ఆ దిశగా చికిత్సను ప్రారంభించారు. దీంతో కొన్ని పశువులు కోలుకుని సాధారణ స్థితికి రావటంతో కొంత ఊరట లభించింది. పశువులను సంరక్షించేందుకు ఉన్నతాధికారులు మరింత చొరవ తీసుకోవాలని పాడి రైతులు విజ్ఞప్తి చేస్తున్నారు.

దస్తావేజు లేఖర్ల పెన్ డౌన్ విజయవంతం

రిజిస్ట్రేషన్ శాఖలో కూటమి ప్రభుత్వం తీసుకొచ్చిన నూతన విధానాలపై దస్తావేజు లేఖర్లు తమ గళం విప్పారు. వారాంతంలో చేపట్టిన పెన్‌డౌన్ కార్యక్రమంలో అత్యధిక మంది భాగస్వాములయ్యారు. రాష్ట్ర వ్యాప్త పిలుపులో భాగంగా చేపట్టిన ఈ కార్యక్రమం ఫలితంగా రెండురోజుల పాటు జిల్లా వ్యాప్తంగా రిజిస్ట్రేషన్‌లు స్థంభించాయి. గత ప్రభుత్వం ఆస్తుల రిజిస్ట్రేషన్ ప్రక్రియ తీసుకొచ్చిన విధానంపై ప్రజల్లో తీవ్రమైన వ్యతిరేకత మూటగట్టుకున్న విషయం విధితమే. అయితే కూటమి అధికారంలోకి వచ్చినప్పటికీ అవే విధానాలను కొనసాగించటంతో పాటు తాజాగా ఒటిపి, స్థానిక సంస్థల డేటా బేస్‌ఆధారంగా ఆస్తుల రిజిస్ట్రేషన్, కార్డ్‌ప్రైమ్ 2.0 లోని సాంకేతిక సమస్యలు వెంటాడుతున్నాయి. ఈ సమస్యలను పరిష్కరించి తమ ఉపాధికి భరోసా కల్పించాలంటూ చేపట్టిన ఆందోళనలకు రియల్‌ఎస్టేట్ వ్యాపారులు సైతం మద్దతు తెలపటం చర్చనీయాంశమైంది. కూటమి ప్రభుత్వం ఇప్పటికైనా పునరాలోచించాలని ఆయా వర్గాలు కోరుతున్నాయి.

వైద్య శిబిరాల నిర్వహణ

ప్రజాశక్తి - యంత్రాంగం

జగ్గంపేట మండలంలోని రాజపూడి పిహెచ్‌సి వద్ద శనివారం స్వస్తినారి సశక్తి పరివార్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా వైద్య శిబిరాన్ని నిర్వహించారు. రోగులకు పరీక్షలు నిర్వహించారు. అలాగే ప్రతిజ్ఞ చేశారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని డివైడిఎంహెచ్ఒ ప్రశాంతి సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి అత్తులూరి నాగేశ్వరరావు, సర్పంచ్ బుసాల విష్ణుమూర్తి, ఉప్పలపాటి బుల్లబ్బు, రేఖా బుల్లిరాజు, సిడిపిఒ ఎం.పూర్ణిమ, పిహెచ్సి వైద్యులు ఎన్.పూజ, మురళి, వైద్య సిబ్బంది, అంగన్‌వాడీ, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు. **రౌతులపూడి** స్థానిక పిహెచ్‌సిలో స్వస్తినారి స్వశక్తి పరివార్ అభియాన్ వైద్య శిబిరాన్ని ఎంపిపి గంటిమల రాజ్యలక్ష్మి, వెలమ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ పైల సాంబశివరావు ప్రారంభించారు. రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. అనంతరం స్వర్ణాంధ్ర స్వచ్ఛంద కార్యక్రమంలో భాగంగా ఆసుపత్రి ఆవరణలో వైద్యాధికారి ఉమామహేశ్వర్ రెడ్డి, వైద్యులు డాక్టర్ పావని, స్వాగత్, సౌమ్య, ఆరోగ్య మిత్ర శ్రీనివాస్ మొక్కలు నాటారు.

అధికారం కోసమే అబద్ధపు హామీలు

ప్రజాశక్తి - ప్రత్తిపాడు

అధికారం కోసమే టిడిపి అధినేత చంద్రబాబు అబద్ధపు హామీలు ఇచ్చి గెద్దెనెక్కారని వైసిపి కోఆర్డినేటర్ ముద్రగడ గిరిబాబు విమర్శించారు. శనివారం మండలంలోని రాచపల్లిలో 'బాబు ష్యూరిటీ - మోసం గ్యారంటీ' కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా వైస్ ఎంపిపి బంకు శ్రీను నివాసంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. నూతనంగా నియమితులైన గ్రామ కమిటీ, అనుబంధ విభాగాల సభ్యులను ఆయన అభినందించారు. నూతనంగా నియమితులైన నాయకులు మాజీ సిఎం జగన్ ఇచ్చిన హామీలు అమలు చేసిన విధానం, ప్రస్తుతం చంద్రబాబు ఇచ్చిన హామీలు ప్రజలను మోసగించిన విధానంపై ప్రజలకు తెలియజేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ సారిపల్లి లోవలక్ష్మి, జడ్‌పిటిసి బెహరా రాజరాజేశ్వరి, వైసిపి నాయకులు బెహరా దొరబాబు, రామిశెట్టి నాని, పెదిరెడ్డి నాని తదితరులు పాల్గొన్నారు.

స్మార్ట్ ఇండియా ఇంటర్నల్ హ్యాకథాన్

ప్రజాశక్తి - గండేపల్లి

సూరంపాలెం ఆదిత్య యూనివర్సిటీలో స్మార్ట్ ఇండియా ఇంటర్నల్ హ్యాకథాన్ 2025ను శనివారం ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు తమ ఆవిష్కరణలను ప్రదర్శించే అద్భుతమైన వేదికగా ఈ కార్యక్రమం నిలిచింది. ఈ హ్యాక థాన్‌లో సుమారు 200 బృందాల విద్యార్థులు పాల్గొని, తమ సృజనాత్మక, వినూత్న ఆలోచనలు ప్యానెల్ ముందు ప్రదర్శిం చారు. భారత ప్రభుత్వానికి చెందిన వివిధ శాఖల ప్రతినిధులు ప్రత్యక్ష పరిశీలన చేశారు. విద్యార్థులు వివిధ టెక్నాలజీని ఉపయోగించి సమస్యలకు పరిష్కారాలను కనుగొన్నారు. ఆదిత్య యూనివర్సిటీ నుంచి 100 పరిష్కారాలను మినిస్టర్ ఆఫ్ ఎడ్యుకేషన్ స్మార్ట్ ఇండియా హ్యాకథాన్‌కు సిఫార్సు చేయడం విశేషమనిచినట్లు డిప్యూటీ ప్రో.ఛాన్సలర్ డాక్టర్ మేడపాటి శ్రీనివాసరెడ్డి, ప్రో వైస్ ఛాన్సలర్ డాక్టర్ రమేష్ అదిరెడ్డి అన్నారు. ఈ కార్యక్రమాన్ని విశాఖపట్నం సిఐఐ జోన్ ఛైర్మన్ డివిఎస్. నారాయణరాజు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ సంజీవరావు, కో-ఆర్డినేటర్ చక్రవర్తి, రమణమూర్తి, డాక్టర్ సాయికృష్ణ, చరణ్‌సంజీవ్ పాల్గొన్నారు.

ఓటర్ల జాబితాలో ఖచ్చితత్వం తప్పనిసరి

ప్రజాశక్తి - కరప

ఓటర్ల జాబితాలో ఖచ్చితత్వం తప్పనిసరిగా ఉండాలని ఆర్‌డిఒ ఎస్.మల్లిబాబు ఆదేశించారు. శనివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బిఎల్‌ఒలకు శిక్షణా కార్యక్రమం జరిగింది. ఈ సందర్భగా ఆయన మాట్లాడుతూ ఓటర్ల జాబితాల ఖచ్చితత్వం, డేటా మ్యాపింగ్ తప్పనిసరిగా ఉండాలన్నారు. ఓటరు జాబితాల్లో ఎలాంటి తప్పులు లేకుండా నిజమైన సమాచారం నమోదు చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో తాహశీల్దార్ టి.దుర్గాప్రసాద్, ఆర్ఐ పవన్‌కుమార్, ఇఒపిఆర్‌డి శ్రీనివాసరావు, ఎఒ సత్య, విఆర్‌ఒలు పాల్గొన్నారు.

లైంగిక ఆరోగ్యంపై అవగాహన

ప్రజాశక్తి - కాకినాడ రూరల్

ఎపి స్టేట్ ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ, జిల్లా ఎయిడ్స్ నియంత్రణ సంస్థ పర్యవేక్షణలో లైంగిక ఆరోగ్యంపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. శనివారం గైగాలపాడు గ్రామ సచివాలయంలో చేంజెస్ కమ్యూనిటీ హెల్త్ అవేర్నెస్ అండ్ నేచరల్ గ్రీన్ ఎన్విరాన్‌మెంట్ సొసైటీ ప్రాజెక్ట్ డైరెక్టర్ పుష్పకుమారి పర్యవేక్షణలో జరిగిన ఈ కార్యక్రమంలో చేంజెస్ ప్రాజెక్టు మేనేజర్ డి.దుర్గభవాని హెచ్‌ఐవి, ఎయిడ్స్ వ్యాధి ఎలా వస్తుంది ? ఎలా వ్యాపించదనే అంశాలపై అవగాహన కల్పించారు. సిడిపిఒ వై.లక్ష్మి మాట్లాడుతూ ఏయిడ్స్ రహిత సమాజాన్ని నిర్మించడంలో ప్రతి ఒక్క మహిళ పాత్ర ఎంతైనా ఉందని చెప్పారు.



రోడ్డుపై నిలిచిపోయిన వర్షపు నీరు

యానాంలో కుండపోత వర్షం..

ప్రజాశక్తి - యానాం

యానాంలో శనివారం సాయంత్రం కురిసిన భారీ వర్షానికి యానాం రోడ్లు చెరువులను తలపించాయి. భారీ వర్షానికి నియోజక వర్గంలోని లోతట్టు కాలనీలు జలమయమయ్యాయి. ప్రధాన రహదారులైన చింతా వారి వీధి, హైస్కూల్ రోడ్, విష్ణాలయం వీధి, పిల్లారాయ వీధి, జిక్రియా నగర్, ద్రాక్షారామ రోడ్డులో భారీగా వర్షపు నీరు చేరింది. వర్షపు నీరు ఎక్కడికక్కడ నిలిచిపోవడంతో వాహనదారులు, స్కూల్ పిల్లలు ఇబ్బందులు పడ్డారు. పిల్లారాయ స్వామి ఆలయంలోకి భారీగా వర్షం నీరు చేరింది. మున్సిపాలిటీ, హెచ్ఆర్ స్క్వేర్ సిబ్బంది వర్షాన్ని సైతం లెక్కచేయకుండా నీటిని బయటకు పంపించే ప్రయత్నం చేశారు.

ఫిట్ ఇండియా సైక్లింగ్ ర్యాలీ...

ప్రజాశక్తి - యానాం

స్థానిక బాలయోగి క్రీడా ప్రాంగణంలో శాయ్ స్పోర్ట్స్ ఇన్‌ఛార్జ్ ఉదయ్‌కుమార్ ఆధ్వర్యంలో ఫిట్ ఇండియా సైక్లింగ్ ర్యాలీ శనివారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పుదుచ్చేరి ప్రభుత్వం ఢిల్లీ ప్రత్యేక ప్రతినిధి మల్లాడి కృష్ణారావు, ఆర్ఎఒ అంకిత్‌కుమార్ పాల్గొన్నారు. జిఎంసి బాలయోగి క్రీడా ప్రాంగణం నుంచి ఫెర్రీ రోడ్డు వరకు సైక్లింగ్ చేసుకుంటూ ర్యాలీ చేశారు. ఈ కార్యక్రమంలో రాజేష్, తేజ, విళ్ళ భద్ర, కమిడి దత్తు పాల్గొన్నారు.

రోడ్డు నిర్మాణానికి నిధుల మంజూరు
ప్రజాశక్తి వార్తకు స్పందన

ప్రజాశక్తి - ప్రత్తిపాడు

ప్రత్తిపాడు-సామర్లకోట రోడ్డు గుంతలమయంగా ఉందని ప్రజాశక్తి దినపత్రికలో ఈ నెల 12న ప్రచురితమైన కథనానికి ఆర్ అండ్ బి అధికారులు స్పందించారు. ఇటీవల కురిసిన వర్షాలు, క్వారీ లారీల వల్ల రోడ్డు గుంతలు పడిందని ఆర్ అండ్ బి ఇఇ రాఘవరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ రోడ్డు మరమ్మతుల కోసం రూ.2 కోట్ల నిధులు మంజూరైనట్లు తెలిపారు. సంబంధిత కాంట్రాక్టరు రోడ్డు నిర్మాణం త్వరితగతిన చేపట్టేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

పేదలకు ఆహారం అందజేత

ప్రజాశక్తి - పెద్దాపురం

మిషన్ అన్నపూర్ణ సహాయనిధి వ్యవస్థాపకులు దేవత రాజేష్‌కుమార్ ఆధ్వర్యంలో శనివారం 40 మంది పేదలకు ఆహారం అంద జేశారు. ఈ సందర్భంగా రాజేష్‌కుమార్ మాట్లాడు తూ కట్టమూరుకు శ్రీవల్లి తన భర్త సత్తిబాబు పుట్టిన రోజు సందర్భంగా అందజేసిన ఆర్థిక సాయంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు తెలిపారు.

సైన్స్ ప్రయోగాలపై అవగాహన

ప్రజాశక్తి - పెద్దాపురం

స్థానిక ఎసిటి సైన్స్ సెంటర్లో శనివారం స్థానిక విద్యానిధి పాఠశాల 10వ తరగతి విద్యా ర్థులకు సైన్స్ ప్రయోగాలపై అవగాహన కల్పిం చారు. సైన్స్ సెంటర్ ఇన్‌ఛార్జ్ బుద్ధా శ్రీనివాస్ విద్యార్థులకు అవగాహన కల్పించారు.

కొనసాగిన దస్తావేజు లేఖర్ల ఆందోళన

ప్రజాశక్తి - తాళ్లరేవు, సామర్లకోట

రిజిస్ట్రేషన్ శాఖలో ప్రభుత్వం నూతనంగా తీసుకొచ్చిన విధానాన్ని సవరించాలని డిమాండ్ చేస్తూ లేఖర్లు పెన్ డౌన్ చేస్తూ చేపట్టిన ఆందోళన తాళ్లరేవు మండలంఠ రెండో రోజు కొనసాగింది. స్థానిక రిజిస్ట్రార్ కార్యాలయం వద్ద లేఖర్లు ధర్నా నిర్వహించారు. మండల లేఖర్ల సంక్షేమ సంఘం ప్రతినిధులు మాట్లాడుతూ రిజిస్ట్రేషన్ సమయంలో క్రయ, విక్రయాల డేటా సబ్మిట్ చేసే సమయంలో ఒటిపి నమోదు వల్ల అనేక అపోహలు వస్తున్నాయని అన్నారు. ఒటిపి లేకుండా మాన్యువల్‌గా నమోదు చేసేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. అనంతరం సబ్ రిజిస్ట్రార్ పి.శారదకు వినతిపత్రం అందజేశారు. లేఖర్ల పెన్ డౌన్‌తో గత రెండు రోజులుగా రిజిస్ట్రేషన్ కార్యాలయంలో క్రయ, విక్రయాలు నిలిచిపోయాయి. అలాగే సామర్లకోటలో దస్తావేజు లేఖర్లు రెండో రోజు తమ ఆందోళనను కొనసాగించారు. రాష్ట్ర ప్రతినిధి మల్యాల సీతాపతిరావు ఆధ్వర్యంలో సామర్లకోట సబ్ రిజిస్టర్ కార్యాలయం ఎదుట నిరసన ప్రదర్శన చేపట్టారు. లేఖరుల సంఘం నాయకులు గోగు అప్పారావు, షేక్ అమీర్, వెంకట్, పేకేటి చిన్న పుత్రయ్య, రమేష్, సుబ్బారావు, దిట్టకవి వెంకట చలపతి, కోలా నారాయణరావు పాల్గొన్నారు.



కార్మికులను సన్మానిస్తున్న జ్యోతుల నెహ్రూ

పారిశుధ్య కార్మికులకు సత్కారం

ప్రజాశక్తి - గండేపల్లి

స్థానిక వెలమపేట రామాయలం వద్ద పారిశుధ్య కార్మికులకు సత్కార కార్యక్రమం శనివారం జరిగింది. ఈ కార్యక్రమంలో ఎంఎల్ఎ జ్యోతుల నెహ్రూ పాల్గొని మాట్లాడారు. గ్రామాల్లో ప్రతి ఇంటికి వెళ్లి చెత్తను సేకరించి శుభ్రపరుస్తున్న వారి ఆరోగ్యం పట్ల ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటుందన్నారు. వారి ఆరోగ్యం కోసం జ్యోతుల నెహ్రూ ఫౌండేషన్ అండగా ఉంటుందన్నారు. మండలంలో 55 మంది కార్మికులకు పోతుల వెంకన్న జ్ఞాపకార్థం మోహన్‌రావు ఆర్థిక సహాయంతో మెడికల్ కిట్లును కార్మికులకు అందజేశారు. అనంతరం వారిని సత్కరించారు. నియోజకవర్గంలో పారిశుధ్య కార్మికులకు కనీస వేతనాలను డిసెంబర్ నెలలో పెంచేందుకు తగు చర్యలు తీసుకోవాలని ఎంపిడిఒ, సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. వేతనం పెంచేందుకు నా వంతు కృషి చేస్తానని కార్మికులకు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు పోతుల మోహన్‌రావు, ఎస్‌విఎస్ అప్పలరాజు, అడబాల భాస్కరరావు, అడబాల ఆంజనేయులు, జాస్తి వసంత్, ఎంపిడిఒ కర్రి సత్యరెడ్డి, ఎఒ చంద్రరావు, వైద్యాధికారి నరేష్, సురేందర్, పంచాయతీ కార్యదర్శులు తరంగిణి, పోతుల శిరీష, తదితరులు పాల్గొన్నారు.

ధూళిపూడికి పలువురి అభినందన

ప్రజాశక్తి - తాళ్లరేవు

మండల టిడిపి అధ్యక్షుడుగా ఎన్నికైన ధూళిపూడి వెంకటరమణను కూటమి నాయకులు శనివారం అభినందించారు. పి.మల్లవరంలోని ఆయన నివాసానికి పలువురు చేరుకుని శాలువాలు, పూలమాలలతో ఘనంగా సత్కరించారు. అభినందనలు తెలిపిన వారిలో సుంకరపాలెం సర్పంచ్, మండల సర్పంచుల సమాఖ్య అధ్యక్షులు టిల్లపూడి నాగేశ్వరరావు, నాయకులు గుంట ముక్కల సూరిబాబు, చీకట్ల నాగేశ్వరరావు, తాతపూడి నాగేశ్వరరావు, సుంకర రామచంద్రరావు, పెద్దిరెడ్డి రవికుమార్, గుంటముక్కల విష్ణు, తదితరులు ఉన్నారు.

వల్లభునికి రూ.2.53 లక్షల ఆదాయం

ప్రజాశక్తి - పెద్దాపురం

మండలంలోని తిరుపతి గ్రామంలో ఉన్న శృంగార వల్లభ స్వామి ఆలయానికి శనివారం ఒక రోజు రూ.2,53,756 ఆదాయం సమకూరిం దని ఆలయ కార్యనిర్వహణాధికారి వడ్డి శ్రీనివాసరావు తెలిపారు. వివిధ ప్రత్యేక దర్శనం టిక్కెట్లు ద్వారా రూ.1,60,790, అన్నదాన విరాళాల ద్వారా రూ.69,429, కేశఖండన ద్వారా రూ.4,160, తులాభారం ద్వారా రూ.250, లడ్డు ప్రసాదం ద్వారా రూ.19,005 వెరసి రూ.2,53,756 ఆదాయం సమకూ రిందని తెలిపారు. యాత్రికులకు ఉదయం పులిహార, మధ్యాహ్నం అన్నదానం నిర్వహించారు.